తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
11 నవంబర్ 2026
Follow :

చెరుకు టన్నుకు రూ.5 వేలు చెల్లించాలి...

- రెండు, మూడు రోజుల్లో చెరుకు ధరపై ప్రకటన
- చెరుకు ధరపై ఫ్యాక్టరీలకు అదనపు కలెక్టర్ గడువు
- ఫ్యాక్టరీల ప్రతినిధులు, రైతు సంఘాలతో అదనపు కలెక్టర్ సంగీత సమీక్ష



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి): చెరుకు రైతులకు గిట్టుబాటు అయ్యేలా చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యాలు మద్దతు ధర నిర్ణయించి చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంగీత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చక్కెర ఫ్యాక్టరీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, చెరుకు రైతులు, చక్కెర శాఖ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమల అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని ఫ్యాక్టరీ యాజమాన్యాలు ధర నిర్ణయించాలని సూచించారు. రైతులకు నష్టం కలగకుండా, ఫ్యాక్టరీల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా సహేతుకమైన ధర ప్రకటించాలన్నారు. రైతుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని రెండు, మూడు రోజుల్లోగా చెరుకు మద్దతు ధరతో పాటు రవాణా చార్జీలను నిర్ణయించి ప్రకటించాలని ఫ్యాక్టరీ ప్రతినిధులను ఆదేశించారు. నిర్ణయించిన ధర వివరాలను జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో రైతులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో చెరుకు దిగుబడులు తగ్గడంతో పాటు సాగు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకు టన్నుకు కనీసం రూ.5 వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో చెరుకు పంటకు మెరుగైన ధర లభిస్తోందని, తమకు కూడా ఆ స్థాయిలో ధర కల్పించాలని కోరారు. అవసరమైతే పొరుగు రాష్ట్రాల్లోని ఫ్యాక్టరీలకు చెరుకు సరఫరా చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఎరువులు, డీజిల్, చెరుకు నరికే కూలీల ఖర్చులు, రవాణా చార్జీలు పెరిగిన నేపథ్యంలో రైతుల పెట్టుబడులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటకు తగిన ప్రతిఫలం దక్కేలా ఫ్యాక్టరీ యాజమాన్యాలు ధర నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీడీసీ సంగారెడ్డి చైర్మన్, రాష్ట్ర చెరుకు పరిశ్రమల పునరుద్ధరణ కమిటీ సభ్యుడు జి. రాంరెడ్డి, సీడీసీ రాయికోడ్ చైర్మన్ ఎం.డి. మోబిన్, రైతు ప్రతినిధులు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, నాజర్, మల్లారెడ్డి, చందర్ తదితరులతో పాటు ఫ్యాక్టరీ ప్రతినిధులు, చక్కెర శాఖ అధికారులు రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

పొగమంచులో
వేగం వద్దు: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

- అప్రమత్తతే రక్ష.. పొగమంచులో నిదానమే మేలు
- మీ భద్రతే కుటుంబానికి భరోసా



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి): చలికాలంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాహనదారులు వేగం నియంత్రించుకొని నిదానంగా వెళ్లాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు వీలైనంత వరకు పొగమంచు సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. ప్రయాణాల్లో తొందరపాటు ప్రదర్శించకుండా, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని కోరారు. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో రహదారులపై దట్టమైన పొగమంచు కమ్ముకుంటుందని, ఎదురుగా వచ్చే వాహనాలు సైతం స్పష్టంగా కనిపించని పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ముఖ్యంగా తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. వాహనాల లైట్లు వేసినా కొంత దూరంలోని వాహనాలు కనిపించకపోవడంతో అధిక వేగం ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు.

పొగమంచులో అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వాహనాలు అదుపుతప్పి బోల్తాపడటంతో పాటు, ముందు వెళ్లే వాహనాలను ఢీకొట్టే ప్రమాదం ఉందన్నారు. వాహనదారులు వేగం తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలని సూచించారు.

వాహనాల ముందు దీపాలు, దిశా సూచికలను తప్పనిసరిగా వినియోగించాలని, పొగమంచు సమయంలో తక్కువ వెలుతురు ఇచ్చే దీపాలను ఉపయోగించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేవారు భద్రతా పట్టీలు తప్పనిసరిగా ధరించాలని ఎస్పీ సూచించారు.

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు, పౌష్టికాహారం కీలకం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి): చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. చిన్నారుల్లో ఎదుగుదల లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైన వైద్య చికిత్స అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్టేట్ హోమ్‌లో బుధవారం 'మన అంగన్‌వాడీ -- మన బాధ్యత' అనే థీమ్‌తో నిర్వహించిన ఆరోగ్యలక్ష్మి, పోషకాహార అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, గర్భిణులు వైద్యుల సూచనల మేరకు ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా వాడాలని చెప్పారు.



ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలని, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. రెండేళ్లలోపు పిల్లలకు అధిక ఉప్పు, చక్కెర కలిగిన పదార్థాలు, ప్యాకెట్ ఆహారాలు, శీతల పానీయాలు ఇవ్వకూడదన్నారు. అరటిపండ్లు, చిరుధాన్యాల జావ, పప్పులు, కూరగాయలు వంటి సహజ ఆహారాన్ని అందించాలని తెలిపారు. చిప్స్, చాక్లెట్లు, శీతల పానీయాలకు పిల్లలను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం గుడ్లు, అన్నం, పప్పు, కూరగాయలను నాణ్యతతో అందించాలని కార్యకర్తలను



ఆదేశించారు. పప్పులో ఆకుకూరలు, కూరగాయలు కలిపి వండడం ద్వారా పోషక విలువలు పెరుగుతాయని తెలిపారు. పిల్లలు ఆహారం తినడం లేదనే కారణంతో నాణ్యతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఆహార నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

చిన్నారుల్లో చిరునవ్వు, కంటిచూపు, శబ్దాలకు స్పందించడం, మాటలు పలకడం, నిలబడటం, నడవడం వంటి అభివృద్ధి లక్షణాలను తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గమనించాలని సూచించారు. వయస్సుకు తగిన ఎదుగుదల కనిపించకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

అనంతరం శ్రీమంతం కార్యక్రమంలో కలెక్టర్ గర్భిణులకు పండ్లు, పూలు, గాజులు, చీరలు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

మద్దిమడుగు గ్రామ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు



- నెల రోజుల్లో భూ రీ సర్వే పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

అచ్చంపేట, నవంబర్ 10 (జనంసాక్షి): మద్దిమడుగు గ్రామ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని, భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న భూ రీ సర్వేను నెల రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పదర మండలం మద్దిమడుగు గ్రామంలో నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన సదస్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్దిమడుగు గ్రామానికి ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పరిధిలో భూ వివాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ, రెవెన్యూ భూముల మధ్య ఉన్న సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా గుర్తించాలని, గతంలో తలెత్తిన సమస్యలను ఇరు శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు.

భూ రికార్డులు, మ్యాపులు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని వారి సమక్షంలోనే సర్వే చేపట్టాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. గ్రామస్తులు తమ పట్టాదారు పాస్ పుస్తకాలు, భూ హక్కు పత్రాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు.భూ రీ సర్వే ద్వారా భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులు రూపొందించాలని పేర్కొన్నారు.

అలాగే గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ



ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య మంత్రి వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

అంతకుముందు కలెక్టర్, ఇతర అధికారులు గ్రామంలోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఏసీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా పిన్నింటి దాసు



చేర్యాల, నవంబర్ 10 (జనంసాక్షి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఉద్యమ కళాకారుడు పిన్నింటి దాసు నియమితులయ్యారు. మంగళవారం సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మేమెంతో మాకంత' నినాదంతో హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. పిన్నింటి దాసు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమావేశాల్లో ఆటపాటల ద్వారా ఉద్యమ స్ఫూర్తిని నింపుతానని పేర్కొన్నారు.

చెకుముకి గోడపత్రికను ఆవిష్కరించిన ఎంఈఓ



జగదేవ్‌పూర్, నవంబర్ 10 (జనంసాక్షి): మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో మంగళవారం 2026 చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను ఎంఈఓ సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్యం మాట్లాడుతూ నవంబర్ 12న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 11 నుంచి 13 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచంతో సహా కాలిపోయి వ్యక్తి అనుమానాస్పద మృతి



కంగ్టి, నవంబర్ 9 (జనంసాక్షి): కంగ్టి మండలం దెగుల్‌వాడి గ్రామంలో గునే జరప్ప (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇంట్లో మంచంపై ఉండగా మంచంతో సహా శరీరం పూర్తిగా కాలిపోయిన స్థితిలో కనిపించడంతో గ్రామంలో కలకలం రేగింది. మృతుడికి భార్య బుజ్జమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై దుర్గారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మృతి చెందాడా? లేక ఇతర కారణాలున్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం మృతికి గల కారణాలు వెల్లడి కానున్నాయి.

ఇందిరమ్మ గృహలక్ష్మితో సొంతింటి కల సాకారం





న్యాల్‌కల్, నవంబర్ 9 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా ఇందిరమ్మ గృహలక్ష్మి పథకం అమలు చేస్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా న్యాల్‌కల్‌లో ఐదు, హద్నూర్‌లో రెండు నూతన ఇందిరమ్మ ఇళ్లలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఎంపీఓ ధనరాజ్ మాట్లాడుతూ... మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు 692 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు 181 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మరో 400 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, త్వరితగతిన బిల్లులు చెల్లిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ...





కేటీ దొడ్డి, నవంబరు 10 (జనంసాక్షి): కేటిదొడ్డి మండలం వెంకటపురంలో వెలసిన శ్రీ పాగుంట లక్ష్మివెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. తమ కులదైవమైన వెంకన్న స్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలకమైన ఘట్టమైన స్వామివారి దివ్య రథోత్సవ కార్యక్రమాన్ని ఈరోజు సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు మరియు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

అఖిలభారత 36వ రైతు మహాసభలను జయప్రదం చేయండి

- నవంబర్ 15న నల్లగొండ రైతు బహిరంగ సభకు వేలాదిగా తరలిరండి
- ర్యాలీని ప్రారంభించిన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు



చేర్యాల, నవంబర్ 10 (జనంసాక్షి): నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐకేఎస్ అఖిల భారత 36వ రైతు మహాసభలు జరగనున్నాయి. 15న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మన ప్రాంత రైతులు వేల సంఖ్యలో నల్లగొండ బహిరంగ సభకు తరలి రావాలని సిఐటియు కార్మిక సంఘం రాష్ట్ర చేర్యాలలో చుక్కా రాములు పిలుపునిచ్చారు.

నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభం లోకి నెట్టబడిందని రైతులు ఎండనక వాననక ఆరుగాలం కష్టపడ్డా ఫలితం లభించడం లేదని రైతులను ఈ ప్రభుత్వాలు కావాలని ఇబ్బందులకు గురి చేస్తూ కార్పొరేటు వ్యవసాయానికి మోడీ ప్రభుత్వం అనుకూల విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు ఎర్ర తివాచి పరుస్తున్నదని దీన్ని మన దేశ రైతాంగం ఏకమై పోరాడాలని ఈ పోరాటాలకు ఏఐకేఎస్ అఖిలభారత రైతు సంఘం నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండలో జరిగే మహాసభలలో రూపకల్పన చేస్తుందని ఈ పోరాటాల్లో పార్టీలకతీతంగా రైతులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పెట్టిన స్వేచ్ఛ వాణిజ్య బిల్లును, విద్యుత్తు సవరణ బిల్లును, విత్తన సవరణ బిల్లును, విరమించుకొని యూరియా ఫర్టిలైజర్ యాప్ ను తొలగించాలని రైతుల పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల ద్వారా రిజర్వాయర్లను నింపకుండా సాగునీరు అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం వరి పంట సాగు చేయొద్దని ఆరుతడి పంటలనే సాగు చేయాలని రైతులపై ఆంక్షలు విధించడం సరికాదని రైతు పంటలకు తగు రక్షణ కల్పించే విధంగా రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని దీనిని రేవంత్ రెడ్డి సర్కార్ సమీక్ష చేసి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు తమ డిమాండ్ల సాధన కోసం అఖిలభారత రైతు సంఘం ఏఐకేఎస్ నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములై నల్లగొండలో జరుగు 36వ రైతు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

ఈ ట్రాక్టర్ ర్యాలీ చేర్యాల వీరభద్ర టాకీస్ సెంటర్ వరకు నిర్వహించడం జరిగింది ముగింపుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రానున్నదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలని నల్లగొండలో జరిగే 36వ అఖిలభారత రైతు సభల ను బహిరంగ సభ జయప్రదానికి రైతులందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో, చుక్కరాములు, కామని గోపాలస్వామి, సందబోయిన ఎల్లయ్య ,రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి,బద్ది పడిగ కృష్ణారెడ్డి ,బండ కింది అరుణ్ కుమార్,తాడూరి రవీందర్, ఆలేటి యాదగిరి, అత్తినీ శారద, చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, చల్లారపు తిరుపతిరెడ్డి, సర్పంచ్ గొర్రె శ్రీనివాస్, ఆముదాల రంజిత్ రెడ్డి,బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డి,రాళ్ల బండి నాగరాజు,ఎం డి షఫీ, బక్కేల్లి బాలకిషన్, పాకనాటి బాల నర్సయ్య,మహేష్, నక్క లావణ్య, తుప్పతి రాజు, కోనేరు ప్రవీణ్ ,నాగపురి కనకయ్య, ఆముదాల నర్సిరెడ్డి,దండ్ల రమేష్ ,బోడిగం నర్సిరెడ్డి, కొంగరి చంద్ర మజుందర్, విగ్నేశ్వరి, నర్సవ్వ ,రేపాక కుమార్, సుర్ణ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్సులపై ఆకస్మిక తనిఖీలు

- వైద్య పరికరాలు, మందుల నిల్వలు, రికార్డుల పరిశీలన
- సమాచారం అందిన 30 సెకన్లలో వాహనం బయలుదేరాలి
- సిబ్బందికి అధికారుల సూచన



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి):
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని 108 అంబులెన్సులను 108 సంగారెడ్డి క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్, హుస్సేన్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్సుల్లోని వైద్య పరికరాలు, మందుల నిల్వలు, వాటి పనితీరును పరిశీలించడంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.
అత్యవసర కేసు సమాచారం అందిన వెంటనే 30 సెకన్లలో అంబులెన్స్‌ను ప్రారంభించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. రోగికి అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకం గురించి సిబ్బందికి వివరించారు. 108 అత్యవసర సేవలు మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ తనిఖీల్లో 108 అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు హుస్సేన్, రఘురామ్, వాహన చోదకులు శ్రీనివాస్, షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సదాశివపేట, నవంబర్ 10(జనంసాక్షి):
దీపావళి పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సదాశివపేట పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని వివిధ వాణిజ్య సంస్థల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని వ్యాపారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లోని దుకాణాలను సందర్శించి వ్యాపారులతో ముచ్చటించారు. వ్యాపార పరిస్థితులు, మార్కెట్ స్థితిగతులు, వినియోగదారుల కొనుగోలు శక్తి గురించి అడిగి తెలుసుకున్నారు.
నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందని, కొనుగోళ్లు తగ్గి వ్యాపారాలు మందగించాయని వ్యాపారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు.



ఈ కార్యక్రమంలో బసంతి, ర్యాగల్లా అశోక్, మల్లికార్జున సుధాకర్, బోనగిరి సంగమేష్, నిజాంపురం రవి అశోక్, భువనగిరి చందర్, విశ్వనాథ్ సంతోష్, సారపు శ్రీనివాస్, కిష్టప్ప సేతు, మొట్లకుంట నారాయణ రవి, జీర్లపల్లి వెంకన్న, సంగారెడ్డిపేట మధుసూదన్, గాజుల కృష్ణ, సింగారం జగన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దిద్దిగే నగేష్, చీల మల్లన్న, మల్లికార్జున వంశీ, సంక్ష య్ గౌడ్, జగదీష్, చింత గోపాల్, అంజయ్య, నాగుల విజయ్, వీరేశం, కలీం పటేల్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుంటున్న కాముగారి నవీన్ గౌడ్

- మానవత్వానికి, మంచితనానికి నిలువెత్తు నిదర్శనం

మనోహరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి): ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ ప్రజాసేవలో తనవంతు కృషి చేస్తున్న కాముగారి నవీన్ గౌడ్‌ను గ్రామస్థులు అభినందిస్తున్నారు. మండల పరిధిలోని మంగళపర్తి గ్రామంలో శివాలయం సమీపంలోని పాత బోరును మరమ్మతు చేయించి మోటార్ ఏర్పాటు చేయించారు. గతంలో అయ్యప్ప సన్నిధానం ఏర్పాటులోనూ స్వాములకు సహకారం అందించి ప్రోత్సహించారు. ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తనవంతు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారని గ్రామస్థులు కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్యా రామకృష్ణారావు మాట్లాడుతూ యువకులు గ్రామ అభివృద్ధి, ప్రజాసేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంగళపర్తి గ్రామం ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.





ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు చెట్టి రవి, కుమ్మరి నరసింహులు, యువ నాయకులు సురేష్ గౌడ్, మానేపల్లి నరేందర్ గౌడ్, చింతల ప్రవీణ్, చాకలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న108 అంబులెన్స్ సిబ్బంది

- అంబులెన్స్‌లోనే గర్భిణీకి సుఖ ప్రసవం.. పండంటి మగబిడ్డ జననం



చిన్నంబావి, నవంబర్ 10 (జనంసాక్షి): అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది మరోసారి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి మార్గమధ్యలోనే సుఖ ప్రసవం చేసి తల్లీబిడ్డను క్షేమంగా ఆసుపత్రికి చేర్చారు. చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూరు గ్రామానికి చెందిన అనురాధ (25)కు సోమవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.
వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధిక మయ్యాయి. పరిస్థితిని గమనించిన 108 మెడికల్ టెక్నీషియన్ శ్రీధర్ అంబులెన్స్‌ను నిలిపివేసి అవసరమైన వైద్య సేవలు అందిస్తూ సాధారణ ప్రసవం చేశారు. ఈ క్రమంలో అనురాధ రెండో కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.
అనంతరం తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటంతో వారిని వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ఆసుపత్రిలో చేర్పించారు. ఆపద సమయంలో సకాలంలో స్పందించి తల్లీ బిడ్డల ప్రాణాలను కాపాడిన 108 అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్ శ్రీధర్, పైలట్ రాఘవేంద్ర, ఆశా కార్యకర్త సుజాతలను అనురాధ కుటుంబ సభ్యులు అభినందించారు. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్, వనపర్తి జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్‌లు అంబులెన్స్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

చాకరిమెట్ల బగలాముఖి క్షేత్రాలలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి పూజలు



శివ్వంపేట, నవంబర్ 10 (జనంసాక్షి): మండల కేంద్రమైన శివ్వంపేట లో కొలువైన శ్రీ భగలాముకి శక్తి పీఠంను ఎమ్మెల్సీఅంజిరెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కమలేష్ పండిట్ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శివంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ పాలక మండలి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆయన సతీమణి సంగారెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఇరువురిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. అంతకుముందు వారు చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామిని దర్శనం చేసుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు దేవదత్తు శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆంజనేయ స్వామి సన్నిధిలో తీసుకువెళ్లారు. పూజలు ముగిసిన తర్వాత ఎమ్మెల్సీ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మార్గమధ్య లో వారు శివ్వంపేట గ్రామ పంచాయతీని సందర్శించగా, సర్పంచ్ పాలక మండలి సభ్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. శివంపేట సంబంధించిన అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పబ్బ రమేష్ గుప్తా బిజెపి మండల శాఖ అధ్యక్షులు పెద్దపులిరవి కొండల్ రావు, ఉప సర్పంచ్ మల్లేష్, పాపగారి రమేష్ గౌడ్, వార్డు సభ్యులు స్వాతి గణేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, మల్లేశ్వరి నర్సింలు, కిషన్, ముత్యాలు, కొండల్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకర విద్యుత్ తీగలు తొలగించాలని వినతి



జడ్చర్ల, నవంబర్ 10 (జనంసాక్షి):
మున్సిపాలిటీ 25వ వార్డు పంచముఖి కాలనీలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న 13 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతూ బీజేపీ నాయకుడు బుక్క నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం టీజీఎస్పీడీసీఎల్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ తీగలను తొలగించి రోడ్డు మార్గంలో స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు వేయాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు వాజీర్, రాజ్ కుమార్, రవి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

14న చలో నర్సాపూర్‌కు పిలుపు

- ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో 14న భారీ నిరసన
- వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ధ్వంసంపై విశ్వకర్మల ఆగ్రహం



కౌడిపల్లి నర్సాపూర్ 10,(జనంసాక్షి):
మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణం చింతకుంట గేట్ వద్ద సుమారు 30 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శ్రీ విశ్వకర్మ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ధ్వంసం పట్ల స్థానిక విశ్వకర్మ సంఘం నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14-11-2026న చలో నర్సాపూర్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వకర్మ జాతీయులు, హిందూ బంధువులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు. సుమారు 10 వేల మందితో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారి, తెలిపారు. విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి చలో నర్సాపూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక విశ్వకర్మ సంఘం నాయకులు, హిందూ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.

బాధితుల వద్దకే వెళ్లి ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి



• ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో నవంబర్ 10 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందిం చేందుకు, పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉన్న, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన వారి వద్దకే వెళ్లి ఆన్‌సైట్‌లో ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులకుఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రజలు తమకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు లేదా నేరానికి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో అక్కడికక్కడే ఆన్‌సైట్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలి అని ఆయన తెలిపారు.

ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు, గాయపడిన బాధితులు, పిల్లలు/మైనర్లు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు, అలాగే దూరప్రాంతాల్లో ఉన్న బాధితులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధితుల భద్రత, గౌరవం, గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలకు పోలీస్ శాఖ పై నమ్మకం మరింత పెరిగేలా ప్రతి పోలీస్ అధికారి సిబ్బందిబాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి అని ఎస్పీ తెలిపారు.

సిద్దిపేటలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి



చేర్యాల, నవంబర్ 10 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల19వ తేదీన పర్యటన సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా సభ నిర్వహణ, ప్రజల రాకపోకలు, నాయకులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించి, సభకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం జరిగింది. ఈ నెల 19న నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ చీరల పంపిణీ, కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ల పంపిణీతో పాటు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఉండనున్నాయి.

ఈ కార్యక్రమంలో చేర్యాల ఏఎంసీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, చేర్యాల మండల అధ్యక్షులు మంజ మల్లేశం, చేర్యాల పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, ధూలిమిట్ట మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్‌తో, మద్దూర్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ బోయిన్ శ్రీనివాస్ తో పాటు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, సుదర్శన్ రెడ్డి, చెరుకు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం



నిజాంపేట, నవంబర్ 10 (జనంసాక్షి): గ్రామంలో వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ లక్ష్మి శ్రీకాంత్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన అద్వితీయ పాత్ర, ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, యువకులు, కుల సంఘాల నాయకులు కూడా విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటయ్య, చాకలి శివకుమార్, హనుమాన్లు, శివ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచాలి

• ఈ నెల 12 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళన

రేవల్లి, నవంబర్ 10 (జనంసాక్షి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్ వైజర్ కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్మికులు తెలిపారు.

ఈ మేరకు మంగళవారం రేవల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ కి ఆందోళన నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు ఇందిర, ఆశ బి, యాసిన్ మాట్లాడుతూ – ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్ విధానంతో ఎంపికైన ఏజెన్సీలు పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్ వైజర్ విభాగాల నిర్వహణ కొనసాగిస్తున్నాయని, అయితే వాటి కాలపరిమితి మూడు సంవత్సరాలకే ఉంటుందని తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీల కాలపరిమితి ముగిసి ఏడాదిన్నర దాటిపోయిందని, దాదాపు 5 సంవత్సరాలుగా పాత ఏజెన్సీలే కొనసాగుతున్నాయని అన్నారు.

ప్రతి మూడేళ్లకు ఒకసారి నూతన టెండర్లతో పాటు ఆసుపత్రి కార్మికులకు జీతాలు పెరుగుతాయని, కానీ పాత ఏజెన్సీలకు అనుమతులు పెంచుతూ పోవడం వల్ల కార్మికులు తీవ్రమైన ఆర్థిక నష్టానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలం చెల్లిన ప్రస్తుత ఏజెన్సీలను రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేలకు పెంచాలని, పండగ, జాతీయ, ఆర్థిక సెలవులు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఒకటో తారీఖు నాడే వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను



క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ కాంట్రాక్ట్ కార్మికులు ఆశ బి.ఇందిరమ్మ, లక్ష్మమ్మ, జహీరా బేగం, వెంకటమ్మ, సాయిలీల, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

నాగపురిలో
డాక్టర్ అందెశ్రీ ప్రథమ వర్ధంతి



చేర్యాల, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర గీత రచయిత డాక్టర్ అందెశ్రీ ప్రథమ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పధానోపాధ్యాయులు ఎలికట్ట ఐలయ్య మాట్లాడుతూ, పశువుల కాపరి స్థాయి నుంచి ప్రపంచ కవిగా ఎదిగిన అందెశ్రీ ఈ ప్రాంతానికి గర్వకారణమని కొనియాడారు.

ఆయన రచించిన 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతంగా నిలిచిందని, 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' పాఠ్యపుస్తకాల్లో చోటు సంపాదించిందని తెలిపారు. అందెశ్రీ పల్లె, ప్రకృతి, ప్రజల జీవనాన్ని ప్రతిబింబించే ఎన్నో గేయాలు రచించారని పేర్కొన్నారు.



గతంలో ఆయనను పాఠశాలకు ఆహ్వానించి విద్యార్థులకు పరిచయం చేయడం తన అదృష్టమని అన్నారు. భూమి, నీరు, గాలి ఉన్నంతకాలం ఆయన గీతాలు అజరామరంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా గౌస్ పాషా నియామకం



ఖిల్లా ఘనపురం, నవంబర్ 10 (జనంసాక్షి): ఖిల్లా ఘనపురం మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గౌస్ పాషా నియమితులయ్యారు. ఆయనతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎం.డి. అజీమ్ (తిరుమలైపల్లి), సయ్యద్ అమీద్ (కొత్తపల్లి తండా), ఎం.డి. అజీమ్ (ఘనపురం), మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా షాహిన్ బేగం, ప్రధాన కార్యదర్శులుగా ఎం.డి. నవీద్, ఎం.డి. ఖాజా, కార్యవర్గ సభ్యుడిగా ఇమ్రాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గౌస్ పాషా మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు టి. సాయి చరణ్ రెడ్డి, స్థానిక నాయకుడు అగారం ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, నాయకత్వ ఆదేశాల మేరకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేల ఆరోగ్యంతో అధిక దిగుబడులు సాధించాలి



కొల్చారం, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని రంగంపేటలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ప్రయోజనాలను వివరించారు. పచ్చిరొట్ట, జీవ ఎరువులతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా యాసంగిలో వరికి బదులుగా జొన్న, మొక్కజొన్న, శనగ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమాకాంత్, డాక్టర్ సేవా నాయక్, డాక్టర్ ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, ఏఈఓ స్రవంతి, ఉపసర్పంచ్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

రైతు పొలంలో ప్రత్యక్షమైన మొసలి..

ఝరాసంగం, నవంబర్ 10 (జనంసాక్షి): వర్షాలు పడక చెరువు ఎండిపోవడంతో చెరువులో ఉండాల్సిన మొసలి రైతు పొలంలో ప్రత్యక్షమైన ఘటన ఝరాసంగం మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం జీర్లపల్లి చెరువులో నీరు అడుగంటడంతో ఒక మొసలి చెరువు నుండి వెళ్లే కాలువ పక్కన గల రైతు శివమణి పొలం గట్టు పై ప్రత్యక్షమైంది. మొసలిని గమనించిన చుట్టు పక్కల రైతులు విషయం స్థానిక తహసీల్దార్ భాస్కర్కు తెలుపడంతో వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి సాయంత్రం 7 గంటల సమయానికి చేరుకున్నారు.

బాచేపల్లి పాఠశాలను సందర్శించిన కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్



బాచేపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాచేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్ ఎంపీపీ ఎస్ బాచేపల్లి పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లో బోధనా విధానాన్ని పరిశీలించి, విద్యార్థుల చదువు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎల్ఎన్ మిడ్‌లైన్ పరీక్ష పత్రాలు, వర్క్‌బుక్‌లను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత సామర్థ్యాలను మరింత పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నారాయణ సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణ్ లక్ష్మి చెక్కు పంపిణీ



కొల్చారం, నవంబర్ 10 (జనంసాక్షి): కొల్చారం మండలం లోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నాయిని జలాల్ పూర్ గ్రామానికి చెందిన గొల్ల మంజుల యాదగిరికి గ్రామ ఉప సర్పంచ్ వెంకట నరసింహులు ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిషన్, జిపిఓ పద్మ మండల నాయకులు నాయిని చిన్న రాయన్న, నాయిని సిద్ధి రాములు, దాసు రాములు, నాయిని సత్యనారాయణ ,బైండ్ల గంగ స్వామి, తదితరులు పాల్గొన్నారు.


ఏఐకేఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ విడుదల



మద్దకల్, నవంబర్ 10 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ఏఐకేఎస్ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 15వ తేదీన నల్లగొండలో జరిగే రైతు ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మద్దకల్ మండల కేంద్రాలలో వాల్ పోస్టర్స్ గోడపత్రికను విడుదల చేశారు.ఈ మహాసభలకు జాతీయ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటస్వామి, వివి. నరసింహ, హమాలి సంఘం నాయకులుతదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవ గీతమై నిలిచిన మహాకవి అందెశ్రీ

- **ప్రజా చైతన్యానికి ఆయన సాహిత్యం చిరస్మరణీయం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి): తెలంగాణ మట్టి వాసనను, ప్రజల కన్నీటి వ్యథను, ఆత్మగౌరవ ఆకాంక్షలను తన అక్షరాల్లో ప్రతిబింబించిన మహాకవి అందెశ్రీ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కొనియాడారు.

అందెశ్రీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే, తెలంగాణ సమాజానికి అందెశ్రీ చేసిన సాహిత్య సేవలను స్మరించుకున్నారు. అందెశ్రీ కవిత్వం కేవలం సాహిత్యానికే పరిమితం కాలేదని, అణగారిన ప్రజల గొంతుకగా, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. మట్టి మనసును, పల్లె ప్రజల జీవన చిత్రాన్ని, అణగారిన వర్గాల ఆవేదనను తన రచనల్లో ఆవిష్కరించిన గొప్ప ప్రజాకవి అని ప్రశంసించారు. జయ జయహే తెలంగాణ' గీతం ద్వారా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు స్వరాన్నిచ్చారని, 'మాయమైపోతున్నదమ్మా మనిషన్నవాడు' వంటి రచనలతో మానవత్వాన్ని మేల్కొలిపారని అన్నారు. 'పల్లె నీకు వందనాలమ్మో' వంటి గీతాలతో పల్లె సంస్కృతికి సాహిత్య గౌరవాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్ర గీతంగా గుర్తింపు కల్పించాలని అందెశ్రీ చేసిన విజ్ఞప్తులకు గత పాలకుల హయాంలో స్పందన లభించకపోవడం, ఆయన రచనకు అధికారిక గుర్తింపు దక్కకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 'జయ జయహే తెలంగాణ' గీతానికి రాష్ట్ర గీతం హోదా కల్పించడం, కోటి రూపాయల నగదు పురస్కారంతో సత్కరించడం, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం ఆయన సాహిత్య సేవలకు దక్కిన సముచిత గౌరవమని అన్నారు.అందెశ్రీ స్మారక పార్కు ఏర్పాటు, ఆయన కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే చర్యలు కూడా ఆయన వారసత్వాన్ని గౌరవించే ప్రయత్నాలని పేర్కొన్నారు.మనిషి మరణించవచ్చు.. కానీ ప్రజల పక్షాన నిలిచిన అక్షరానికి మరణం ఉండదు. అందెశ్రీ కలం నుంచి జాలువారిన ప్రతి భావం తెలంగాణ చరిత్రలో తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.ఈ సందర్భంగా మహాకవి అందెశ్రీకి ఆయన హృదయపూర్వక నివాళులర్పించారు.

కిసాన్ సభ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- **ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో మహాసభలు**
- **మోడీ ప్రభుత్వం అమెరికాకు పూర్తిగా లొంగిపోయింది**
- **రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు**
- **సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు**

కొమురవెల్లి (జనంసాక్షి): అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న మహాసభలకు మద్దతుగా మంగళవారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేలాది మందితో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా చుక్క రాములు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆముదాల మల్లారెడ్డితో కలిసి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై పోరాడుతున్న వెయ్యి మందికి పైగా ప్రతినిధులు, లక్షలాది మంది రైతులు మహాసభలకు హాజరవుతారని తెలిపారు. మొదటిరోజు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు, దీనికి అఖిలభారత నాయకురాలు బృందా కారత్ హాజరవుతారని వెల్లడించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. 32 దేశాల వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతించడం వల్ల దేశీయ రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం వల్ల దేశంలోని పాడి, పౌల్ట్రీ రంగాలకు ముప్పు పొంచి ఉందన్నారు. విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన చట్ట సవరణ బిల్లులు అమలైతే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల



చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, రైతు హక్కులను పరిరక్షించడం, వ్యవసాయ రంగ సమస్యలపై మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 15న రైతులు పెద్ద సంఖ్యలో నల్లగొండకు తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాములు సిస్తి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి



నిజాంపేట్, నవంబర్ 10 (జనంసాక్షి): నిజాంపేట్ మండలం నాగధర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాములు సిస్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా దుందుభి వాగును ధ్వంసం చేస్తున్న వారిపై కేసు నమోదు



రాజాపూర్, నవంబర్ 10(జనంసాక్షి): రాజాపూర్ మండల పరిధిలోని దుందుభి వాగులో అక్రమ ఇసుక తయారీ కేంద్రాల దగ్గర హీటాచీలతో, జేసీబీలతో దుందుభి వాగులోని మట్టిని తవ్వి ఫీల్డర్ చేసి కృత్రిమ ఇసుకను తయారు చేసి నిత్యం ట్రాక్టర్ లలో, టిప్పర్ లలో హైదరాబాద్ తరలిస్తు ఇసుక మాఫియా సొమ్ము చేసుకుంటున్నారు. దుందుభి వాగును ధ్వంసం చేస్తున్న ఇసుక మాఫియా పై చర్యలు తీసుకోవాలని రాజాపూర్ మండల సర్పంచ్ లు ప్రజావాణి లో పిర్యాదు లు చేశారు. మంగళవారం సాయంత్రం కుచ్చర్ కల్ గ్రామానికి చెందిన చెన్నయ్య దుందుభి వాగులో మట్టిని హీటాచీ తోడుతుండగా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజాశేఖర్ తెలిపారు.

ప్రతి పాఠశాలలో దివ్యాంగ పిల్లల గుర్తింపు స్క్రీనింగ్



కొండపాక, నవంబర్ 10 (జనంసాక్షి): కుకునూరుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3 నుంచి 18 ఏళ్ల వయసున్న దివ్యాంగ పిల్లలను ముందస్తుగా గుర్తించేందుకు ప్రశస్త్ స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు పి. ప్రశాంత్, పి. అంజయ్య మండలంలోని చిన్న కిష్టాపూర్ జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో స్క్రీనింగ్ చేపట్టారు. యూడైస్ రికార్డుల ఆధారంగా ఉపాధ్యాయులు తమ మొబైల్ల ద్వారా ప్రశస్త్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసి, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేవంత్ పాలనలో రైతులకు కన్నీళ్లు: కురువ పల్లయ్య

- **రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన రవాణా అధికారులపై చర్యలు తీసుకోవాలి**

గద్వాల నడిగడ్డ, నవంబర్ 10 (జనంసాక్షి): రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన జిల్లా రవాణా అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఐజ మండలం తుపత్రాల గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై ఆయన స్పందించారు.

గ్రామంలో పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన జిల్లా రవాణా అధికారులు ట్యాంకర్లతో నీరు పెట్టడం అక్రమమని, వెంటనే నిలిపివేయాలని రైతులను హెచ్చరించినట్లు ఆరోపించారు. లేదంటే పోలీస్ స్టేషన్‌లో రూ. 1.50 లక్షలు చెల్లించాల్సి వస్తుందని బెదిరించి, ఒక్కొక్క రైతు నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేశారని పేర్కొన్నారు. మాణిక్యం అనే రైతు నుంచి రూ.5 వేలు, మహేందర్ గౌడ్ నుంచి మరో రూ.5 వేలు తీసుకున్నారని ఆరోపించారు.





పంటలు ఎండిపోతుండటంతో అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించుకుంటున్న రైతుల నుంచి అధికారులు డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమని పల్లయ్య విమర్శించారు. తమ వద్ద డబ్బులు లేవని, తాము రైతులమని వేడుకున్నా అధికారులు కనికరించలేదని అన్నారు. రైతుల పంటలను కాపాడుకునేందుకు నీటిని అందించడంలోనూ ఇబ్బందులు సృష్టించడం బాధాకరమని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి పాలనలో రైతుల నుంచి లంచాలు వసూలు చేయడం ప్రజాపాలనకు నిదర్శనమా అని ప్రశ్నించారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతులు మాణిక్యం, మహేందర్ గౌడ్, బాలు రాజు, చిన్న పెద్దయ్య, హుస్సేని, సుజాత, ఈరన్న, భగవాన్ దాస్, ధర్మన్న, రాయుడు, భాస్కర్, రామాంజనేయులు, శేఖర్, రాజు, వడ్డె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో మురికి కాలువల సమస్యకు శాశ్వత పరిష్కారం ఏదీ?

- జేసీబీతో పూడిక తొలగిస్తున్నా మళ్లీ అదే పరిస్థితి
- దుర్వాసన, దోమల బెడదతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- బీజేపీ గ్రామ అధ్యక్షుడు వంశవర్ధన్ రెడ్డి డిమాండ్

కోహీర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మురికి కాలువల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ గ్రామ అధ్యక్షుడు పి.వంశవర్ధన్ రెడ్డి గ్రామపంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. గ్రామంలోని మురికి కాలువల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామంలోని దాదాపు అన్ని వీధుల నుంచి వచ్చే మురుగునీరు ప్రధాన కాలువలో కలుస్తుండటంతో చెత్తాచెదారం, మట్టి పేరుకుపోయి నీరు సక్రమంగా ప్రవహించడం లేదని తెలిపారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగునీరు పొంగిపొర్లి రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



గ్రామపంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో ఎప్పటికప్పుడు ప్రధాన కాలువలో పూడిక తొలగిస్తున్నప్పటికీ కొద్ది రోజులకే మళ్లీ చెత్త, మట్టి పేరుకుపోతున్నాయని పేర్కొన్నారు. తాత్కాలికంగా పూడిక తొలగించడం వల్ల ప్రభుత్వ నిధులు, సమయం వృథా అవుతున్నాయే తప్ప ప్రజలకు శాశ్వత ఉపశమనం లభించడం లేదన్నారు. అధికారులు ప్రధాన కాలువ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా సరైన వాలుతో పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట కొత్త కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు సంబంధించిన సమస్యను అధికారులు ప్రాధాన్యతతో పరిగణించి తాత్కాలిక చర్యలకు స్వస్తి పలికి శాశ్వత పరిష్కారం చూపాలని వంశవర్ధన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నాగల్‌గిద్ద, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ బిరాదార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ కుమార్ షేట్కార్ అందజేశారు.

నారాయణఖేడ్‌లోని జహీరాబాద్ ఎంపీ సురేష్ షేట్కార్ నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేష్ షేట్కార్ మాట్లాడుతూ ఆపద సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు.

కొల్చారం

గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

- గుండె సంబంధిత వ్యాధుల గుర్తింపునకు ప్రత్యేక పరీక్షలు
- గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్ ఆధ్వర్యంలో



కొల్చారం, నవంబర్ 10 (జనంసాక్షి):
మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ దేవన్నగారి శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన సింధు హాస్పిటల్ వారు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులకు ఉచితంగా ఈసీజీ, ఛాతీ స్కానింగ్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు.

ఈ శిబిరం ద్వారా గుండె సంబంధిత సమస్యలను ముందస్తుగా గుర్తించడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలించారు. ఈ అవకాశాన్ని 120 మంది సద్వినియోగం చేసుకున్నారని సర్పంచ్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని సర్పంచ్ దేవన్న గారి శేఖర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సింధు హాస్పిటల్ మార్కెటింగ్ హెచ్ఓడీ చాగంటి శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ వడ్ల ప్రభాకర్, గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మృత కానిస్టేబుల్

కుటుంబానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నాగర్‌కర్నూల్, నవంబర్ 10 (జనంసాక్షి): గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి రూ.5 లక్షల వ్యక్తిగత బీమా చెక్కును జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ మంగళవారం అందజేశారు. పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ మంజూరు చేసిన ఈ చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అకాల మరణం చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. రామస్వామి సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ కృష్ణయ్య, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, పోలీస్ కోఆర్డినేటర్ గోలి శ్రీనివాస్, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆశావర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

- డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె: జేఏసీ హెచ్చరిక

మక్తల్, నవంబర్ 10 (జనంసాక్షి): ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మక్తల్‌లో నిరసన తెలిపారు. ఈ మేరకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి క్యాంపు కార్యాలయంలో ఆయన పీఏ యాదవరాజుకు జేఏసీ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.



గత 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు ప్రస్తుతం రూ.9,900 మాత్రమే చెల్లిస్తున్నారని, పెరుగుతున్న ధరలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల హామీల మేరకు ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సి.ఆర్. గోవింద్ రాజ్, భరత్, ఆశా యూనియన్ నాయకురాళ్లు గోవిందమ్మ, యశోద, ఇందిర, అమీనా బేగంతో పాటు ఐదు మండలాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాబ్ కార్డు సమస్య

పరిష్కరించని ఏపీవోను సస్పెండ్ చేయాలి

శివ్వంపేట, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని శివ్వంపేట గ్రామానికి చెందిన వజ్జ పద్మ కుటుంబ జాబ్ కార్డు సమస్యను మూడేళ్లుగా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న ఏపీవో అనిల్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. 2008లో జారీ చేసిన 30295 నంబర్ జాబ్ కార్డులో కార్డుదారులకు తెలియకుండా దాయాదుల పేర్లు, ఆధార్ వివరాలు అనుసంధానం చేయడంతో కుటుంబానికి రావాల్సిన 100 రోజుల పని దినాల్లో కోత పడుతోందని పద్మ, అనిత ఆరోపించారు. ఇతరులకు కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని పలుమార్లు కోరినా ఏపీవో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవోను కలిసి సమస్యను వివరించారు. పక్షం రోజుల్లో పరిష్కరించకపోతే డీఆర్డీవో పీడీ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



బిఆర్ఎస్ నాయకులు

నరేష్ వందేళ్లు చల్లగా ఉండాలి

- గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి



తూప్రాన్, నవంబర్ 10(జనంసాక్షి):
బిఆర్ఎస్ నాయకులు నరేష్ వందేళ్లు చల్లగా ఉండాలని ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు బిఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి తెలిపారు. కూచారం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు నరేష్ జన్మదిన సందర్భంగా కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు హిమాపురం శేఖర్ గౌడ్, వెంకట గౌడ్, లక్ష్మణ్ సింగ్, సాయిరాం గౌడ్ ,సాదు సత్యం, కుంట రాజు, కత్తుల వెంకటేష్, పూల అర్జున్, శ్రీనివాస్ గౌడ్, సాయి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి

జీఎంఆర్ ఫౌండేషన్ రూ.లక్ష విరాళం



సిర్గాపూర్, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని సర్పంచ్ తాండలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ భవానీ మాత ఆలయ నిర్మాణానికి జీఎంఆర్ ఫౌండేషన్ రూ.లక్ష విరాళం అందించింది. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గుర్రపు మచ్చేందర్ ఆదేశాల మేరకు జీఎంఆర్ బృందం సభ్యులు ఈ విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించిన మచ్చేందర్ సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ సాగర్, బీఆర్ఎస్ నాయకులు బసవ రాజు పటేల్, యాదవరావు పటేల్, తుకారాం, జీఎంఆర్ ప్రతినిధులు హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



గద్వాల, నవంబరు 10(జనంసాక్షి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసిన 49 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు అధికారులు నియామక పత్రాలు అందజేశారు. మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా పారదర్శకంగా ఎంపికైన అభ్యర్థులకు అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎంహెచ్‌వో సంధ్యా కిరణ్మయి కలెక్టరేట్‌లో ఈ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా నియమితులైన సిబ్బంది తమ విధుల పట్ల పూర్తి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో సంధ్యా కిరణ్మయి మాట్లాడుతూ ఈ నియామకాలతో జిల్లా వైద్య శాఖలో సిబ్బంది కొరత తీరుతుందని, సేవలు మరింత వేగవంతమవుతాయని తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఎంపికైన అభ్యర్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమిటి?



కొత్తపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి): కొడంగల్ నియోజక వర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల పాటు పర్యటించినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని టీఆర్ఎస్ కొత్తపల్లి మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ప్రజలు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించలేకపోయిందని ఆరోపించారు.

పర్యటన పేరుతో వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం తప్ప సమస్యల పరిష్కారానికి హామీలు ఇవ్వలేదన్నారు. మండలంలో ఇంకా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నీటి వనరుల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం కల్పిస్తూ తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పంట నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పర్యటనలు, ప్రచార ఆర్భాటాలకు పరిమితం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నంది విగ్రహం చోరీ కేసు దర్యాప్తుపై మంత్రి ఆరా





కొల్లాపూర్, నవంబర్ 10 (జనంసాక్షి): కొల్లాపూర్ మండలం కుడికిల్ల గ్రామంలోని సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన శివాలయంలో నంది విగ్రహం చోరీ ఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరా తీశారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్న అనంతరం అర్చకుల ఆశీర్వచనం పొందారు. నంది విగ్రహం చోరీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు పురోగతిపై పోలీసు అధికారులతో మాట్లాడారు.

ఆలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారని, త్వరలోనే వారిని పట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఘుపతిరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు, మాజీ జెడ్పీటీసీ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి టీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తాం



మద్దూరు, నవంబర్ 10 (జనంసాక్షి): కొడంగల్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీల ఏర్పాటుకు నాయకులు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కమిటీలను ఏర్పాటు చేస్తామని రాజ ప్రభాకర్ తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటనపై స్పందిస్తూ, భారీ పర్యటనతో ప్రజలు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు కలిగిన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. పర్యటనలు, ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, బాలచందర్ గౌడ్, అశోక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం
మండలంలో నేటి నుంచి గ్రామ సభలు

- ఎంపీడీవో రఫీ ఉన్నిసా



కొల్చారం, నవంబర్ 10 (జనంసాక్షి): కొల్చారం మండలంలో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాలలో ఎల్‌నినో ప్రభావం, వర్షా బావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. నీటి వృధా అరికట్టడం, ఇంకుడు గుంతల నిర్మాణం, వివిజి రామ్ జి పథకంపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. మొదటిరోజు వెంకటాపూర్, వసురం తండాలో గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు.

సీఎంఆర్ అక్రమాలపై విచారణకు డిమాండ్



గద్వాల, నవంబర్ 10 (జనంసాక్షి): జిల్లాలో సీఎంఆర్ ధాన్యం సేకరణ, బియ్యం అప్పగింతలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన ఇన్‌ఛార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు బుచ్చిబాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. మిల్లుల్లో తనిఖీలు చేసి సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆధారాలతో సీఐడీ, ఈడీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి చేసిన సాయంపై బీఆర్ఎస్ నేతల విమర్శలు సరికాదు



చేర్యాల, నవంబర్ 10 (జనంసాక్షి): తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ విమర్శలకు తావిస్తున్నాయని చేర్యాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజె మల్లేశం మండిపడ్డారు. బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ్ మరణానికి జేసీబీ సీజ్, దేవాదుల నీళ్లు, భూవివాదం వంటి అంశాలను ప్రస్తావిస్తూ అసలు కారణాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

లక్ష్మణ్ గౌడ్ సూసైడ్ నోట్‌లోని 'ఉద్యమంలోకి వెళ్లి జీవితాన్ని ఖరాబు చేసుకున్నా' అనే వాక్యం పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తోందని మల్లేశం పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన ఉద్యమకారుడిని గత ప్రభుత్వం ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు.

లక్ష్మణ్ గౌడ్ మృతి అనంతరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారని, ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం ఇచ్చారని తెలిపారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల విద్యా బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఉద్యమకారులను పట్టించుకోకుండా, ఇప్పుడు కుటుంబానికి చేసిన సాయంపై విమర్శలు చేయడం సరికాదని మల్లేశం అన్నారు. లక్ష్మణ్ గౌడ్ మరణాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఉన్న బాలుడికి
రంగధాం భాను ఆర్థిక సాయం



నంగునూరు, నవంబర్ 10 (జనంసాక్షి): కాకినాడకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడికి కొండపాక సత్యసాయి ట్రస్టులో ఉచితంగా గుండె శస్త్ర చికిత్స జరిగింది. బాలుడి కుటుంబం సిద్దిపేటలోని కృష్ణారెడ్డి లాడ్జ్‌లో బస కోసం వచ్చిన విషయం తెలుసుకున్న తిమ్మాయిపల్లికి చెందిన రంగధాం భాను వారికి ఉచితంగా గది ఇప్పించారు. అలాగే తన మిత్రుల సహకారంతో రూ.7 వేల సాయం సేకరించి బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి తమ మిత్రబృందం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భాను తెలిపారు. సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు చెప్పారు.

తండ్రి కొడుకుల మధ్య ఆస్తుల వివాదం...





కొల్చారం, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని రంగంపేటలో శ్రీ తిరుమల రైస్ మిల్ యజమాని ముప్పిడి భాస్కర్ కుటుంబంలో ఆస్తుల వివాదం చోటుచేసుకుంది. తన కుమారుడు కృష్ణ ఆస్తి విక్రయానికి అడ్డుపడుతూ, తనను గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నాడని భాస్కర్ ఆరోపించారు. ఈ విషయమై గత జూన్ 26న జిల్లా ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు మంగళవారం కొల్చారంలో విలేకరులకు తెలిపారు. తన జీవనాధారమైన ఆస్తిని కూడా లాక్కోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అయితే, తన తండ్రిపై తాము చేయి చేసుకోలేదని కుమారుడు కృష్ణ పేర్కొన్నారు. జీవన ఖర్చుల కోసం ప్రతి నెలా రూ.30 వేలు ఇస్తున్నామని, అయినప్పటికీ తమపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ కుటుంబ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇరువైపుల ఆరోపణలతో కుటుంబ ఆస్తుల వివాదం చర్చనీయాంశంగా మారింది.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్



బెజ్జంకి, నవంబర్ 10 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బెజ్జంకి మండల కేంద్రంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. అదేవిధంగా సబ్సిడీపై వేరుశనగ,పొద్దుతిరుగుడు విత్తనాలతో పాటు వ్యవసాయ పరికరాలను అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది అనీ అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు లక్ష రూపాయల రుణమాఫీ హామీని సైతం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. వ్యవసాయ పరికరాలపై సబ్సిడీలను ఎత్తివేసి రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు భరోసాతో వ్యవసాయం చేసుకుంటున్నారని లింగాల శ్రీనివాస్ తెలిపారు.

మృతి చెందిన సర్పంచ్
సత్యం కుటుంబానికి ఆర్థిక సాయం



నంగునూరు, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని అప్పలాయచెరువు గ్రామ సర్పంచ్ సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం చిన్నకోడూరు మండల సర్పంచులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సత్యం అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

దిగ్వాల్ పీహెచ్‌సీలో మళ్లీ చోరీ.. వరుస దొంగతనాలతో కలకలం!

- 20 రోజుల క్రితమే చోరీ.. మళ్లీ అదే ఆసుపత్రిలో దొంగతనం
- సీసీ కెమెరాల్లో నమోదైన దొంగతనం దృశ్యాలు
- ప్రధాన ద్వారం పక్కన రెయిలింగ్ రాడ్లు ఎత్తుకెళ్లిన దుండగుడు

కోహీర్, నవంబర్ 10 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుమారు 20 రోజుల క్రితం ఇదే పీహెచ్‌సీలో చోరీ జరిగిన ఘటన మరువక ముందే మరోసారి దొంగతనం జరగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు పీహెచ్‌సీలోకి ప్రవేశించి ప్రధాన ద్వారం మెట్ల పక్కన ఏర్పాటు చేసిన రెయిలింగ్‌కు సంబంధించిన ఇనుప రాడ్లను తొలగించి ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సీసీ కెమెరాల ఫుటేజీలో దుండగుడు చోరీకి పాల్పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నట్లు సమాచారం.

ఒకే ఆసుపత్రిలో కొద్ది రోజుల వ్యవధిలో రెండుసార్లు చోరీ జరగడం పట్ల ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విలువైన పరికరాలు, ప్రజలకు అవసరమైన వైద్య సామగ్రి ఉంటున్న నేపథ్యంలో రాత్రి వేళల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతున్న



దుండగుడిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి



గద్వాల, నవంబర్ 10 (జనంసాక్షి): కరువుతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జోగులాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ మధుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి నీరందించాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. పేద కుటుంబాలకు ఆరు నెలల పాటు ఉచిత నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, పంట రుణాలను షరతుల్లేకుండా మాఫీ చేసి పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమ్మె నోటీసులు జారీ



గద్వాల, నవంబర్ 10(జనంసాక్షి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు సమ్మె బాట పట్టారు. డిసెంబర్ 15 నుంచి తలపెట్టిన సమ్మెకు సంబంధించి గద్వాల ఎమ్మెల్యేకు, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావుకు నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18,000 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, సహాయ కార్యదర్శి సునీత, ఆశా వర్కర్ల సంఘం నాయకులు శ్రీదేవి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. 12 మంది అరెస్ట్



కంగ్టి, నవంబర్ 10 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ఘనపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం సీఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.38,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు సమాచారం. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఎద్దులగూడెంలో భూముల రి సర్వే



మల్దకల్, నవంబర్ 10 (జనంసాక్షి): మల్దకల్ మండల పరిధిలోని ఎద్దులగూడెం గ్రామంలో మంగళవారం తాసిల్దార్ ర్యూన్సీరాణి ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. గ్రామంలోని రైతుల సర్వే నెంబర్ల వారీగా సర్వే నిర్వహించి డ్రువీకరించారు.తెలంగాణ ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పొజిషన్లో ఉన్న రైతులకు సర్వే నంబర్ల వారీగా వారి విస్తీర్ణం మ్యాపు వారికి అందజేయబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కరీం,సర్వేయర్ బీచుపల్లి, సోమశేఖర్, గ్రామపాలన అధికారుల లక్ష్మన్న, లైసెన్స్ సర్వేయర్లు మహమ్మద్ తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు

మల్దకల్, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని నాగర్ దొడ్డి ప్రాథమికోన్నత పాఠశాల, వీరలాపురం ప్రాథమిక పాఠశాల, ఎల్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఇన్‌చార్జి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ రెడ్డితో కలిసి అధికారులు మంగళవారం సందర్శించారు. తరగతి గదుల్లో బోధన, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఎల్కూరు పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ పాటించడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని వంటవారిని హెచ్చరించారు.

మహబూబ్‌నగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి...

- సీపీఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్



మహబూబ్‌నగర్ ప్రతినిధి, నవంబర్ 10 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా మొత్తాన్ని తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి జిల్లాలో తీవ్ర దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారంతో పాటు పశువులకు మేత, నీరు సరఫరా చేయాలని, ఉపాధి కోల్పోతున్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక పథకాల ద్వారా పనులు కల్పించాలని కోరారు. వి.బి.జి. రామ్.జి. పథకం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను కోతలు లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, పంటల వారీగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తికి రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులకు ఫీజు మాఫీ చేయాలని, రేషన్ దుకాణాల ద్వారా 13 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కూలీలు, కౌలుదారులను ఆదుకోవాలని అన్నారు. స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, కొండపల్లి రాముడు, సురేష్, పద్మ, ఇంద్ర, ఆంజనేయులు, మహేష్, సత్యనారాయణ రెడ్డి, శంకర్ నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుంకరి బసవరాజ్, సుందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులపై కెనరా బ్యాంక్ సిబ్బంది దురుసు!

- రూ.1,138 కట్‌పై వివరణ కోరితే ఖాతా మూసుకోవాలంటూ ఒత్తిడి?
- అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించాలని ఖాతాదారుల డిమాండ్


కోహీర్, నవంబర్ 10 (జనంసాక్షి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన బ్యాంకుల్లోనే అవమానాలు ఎదురవుతున్నాయని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలి గ్రామానికి చెందిన కెనరా బ్యాంకు ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఖాతాల్లో నగదు ఎందుకు మినహాయిస్తున్నారో తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్తే సరైన సమాధానం ఇవ్వకుండా సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మంగళవారం ఓ మహిళా ఖాతా నుంచి రూ.1,138 నగదు కట్ కావడంతో ఆమె బ్యాంకుకు వెళ్లి క్యాషియర్‌ను వివరణ కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ తనతో దురుసుగా మాట్లాడారని బాధిత మహిళ ఆరోపించారు. ఖాతా నుంచి డబ్బులు ఎందుకు మినహాయించారని ప్రశ్నించినందుకు, బ్యాంకులో ఖాతా కొనసాగించడం ఇష్టం లేకపోతే మూసుకోవాలని ఒత్తిడి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తనపై దాడికి సిద్ధమైనట్లుగా వ్యవహరించారని పేర్కొన్నారు.

ప్రశ్నిస్తే ఖాతా మూసుకోవాలా?

ఖాతాదారులు తమ సొమ్ముకు సంబంధించిన వివరాలు అడగడం తప్పెలా అవుతుందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. వివిధ ఛార్జీల పేరుతో ఖాతాల నుంచి నగదు మినహాయించినప్పుడు అందుకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత బ్యాంకు సిబ్బందిపై ఉందని పేర్కొంటున్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, వృద్ధులు, నిరక్షరాస్యులతో మర్యాదగా వ్యవహరించాలని కోరుతున్నారు.



సీసీ కెమెరాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలి...

ఈ ఘటనపై కెనరా బ్యాంకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం జరిగిన ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. మహిళా ఖాతా నుంచి మినహాయించిన రూ.1,138కు సంబంధించిన పూర్తి వివరాలు, నగదు కట్‌కు గల కారణాన్ని వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్‌తో పాటు బాధ్యులైన సిబ్బంది వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు, గ్రామస్థులు కోరుతున్నారు. బ్యాంకులు ప్రజలకు నమ్మకమైన సేవలు అందించాలే తప్ప, ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేయకూడదని స్పష్టం చేస్తున్నారు.

పట్టపగలే స్కూటీ చోరీ.. సీసీ కెమెరాల్లో దృశ్యాలు



గద్వాల, నవంబర్ 10 (జనంసాక్షి): పట్టణంలోని మోర్ మార్కెట్ వద్ద పట్టపగలే స్కూటీ చోరీ కలకలం రేపింది. ఓ వ్యక్తి స్కూటీని మార్కెట్ ముందు పార్క్ చేసి షాపింగ్‌కు వెళ్లగా, గుర్తుతెలియని దొంగ వేరే తాళాలతో వాహనాన్ని స్టార్ట్ చేసి పరారయ్యాడు. తిరిగి వచ్చిన బాధితుడు స్కూటీ కనిపించకపోవడంతో మార్కెట్ సీసీ కెమెరాలను పరిశీలించగా చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో బాధితుడు ఫుటేజీ ఆధారంగా గద్వాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. వాహనదారులు హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

చెన్నప్ప కు సీఎం ఆర్ఎఫ్ ఐదు లక్షల ఎల్ఓసి అందజేత



అమరచింత, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని కొంకనివానిపల్లి గ్రామానికి చెందిన బంగారాయాల చెన్నప్పకు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం నాయకుల ద్వారా తెలుసుకొని తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి వారి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 5 లక్షల ఎల్ఓసి మంజూరు చేసి టీజీ టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు ప్రతిపాదనలను అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి, వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా కల్పించిన మంత్రి శ్రీహరి బంగారాయాల చెన్నప్ప కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

క్యాన్సర్ బాధితుడిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



ఖిల్లా ఘనపురం, నవంబర్ 10 (జనంసాక్షి): మండల కేంద్రానికి చెందిన కుమ్మరి కొండయ్య నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అగారం ప్రకాష్ కొండయ్య ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యానికి అవసరమైన మందుల ఖర్చుల కోసం ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఎల్ఓసీ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గౌస్ పాషా, మ్యాతరీ రాములు, నగేష్, ముజాహిద్, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ భూ రీ సర్వేకు గ్రామస్థులు, రైతులు సహకరించాలి: ఆర్డీవో సుబ్రమణ్యం



ఖిల్లా ఘనపురం, నవంబర్ 10 (జనంసాక్షి): మండల పరిధిలోని అంతాయిపల్లి, సూరాయిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను మంగళవారం రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రమణ్యం, స్థానిక తహశీల్దార్ బి. సుగుణతో కలిసి పరిశీలించారు.

మొదట అంతాయిపల్లి గ్రామంలో భూ రీ సర్వే పనుల పురోగతిని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. భూ రీ సర్వేపై రైతులకు, గ్రామస్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ బి. సుగుణ మాట్లాడుతూ.. అంతాయి పల్లి గ్రామంలో మొత్తం 347 ఎకరాలకు గాను ఇప్పటివరకు 209 ఎకరాల్లో భూ రీ సర్వే పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా భూమి ఘనపురం లిఫ్ట్ ఇరిగేషన్‌లో కలిసిందని వివరించారు.

అనంతరం సూరాయిపల్లి గ్రామంలో సర్వే పనులను పరిశీలించారు. గ్రామ పరిధిలో మొత్తం 1,732 ఎకరాల 6 గుంటల భూమికి గాను 631 ఎకరాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలిన భూమిలో సుమారు 599 ఎకరాల 4 గుంటలు ప్రభుత్వ భూమి, గ్రామకంఠం భూమిగా గుర్తించినట్లు వివరించారు.

అనంతరం ఆర్డీవో సుబ్రమణ్యం మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న భూ రీ సర్వేపై రైతులు, గ్రామస్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సర్వే అధికారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. అలాగే గ్రామ సరిహద్దులను గుర్తించి, హద్దుల వద్ద సర్వే రాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నయబ్ తహశీల్దార్ లక్ష్మీకాంత్, మండల సర్వే అధికారి ఆనంద్, ఆర్ఐ తిరుపతయ్య, మాసయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ఆయా గ్రామస్థులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోమాత దివ్య దీవెనలతోనే లోక కల్యాణం...

- **పసుపుల అణాకులం గోకులం క్షేత్రంలో ఘనంగా గోపూజ**






మక్తల్, నవంబర్ 10 (జనంసాక్షి): పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం మక్తల్ మండలంలోని పసుపుల గ్రామ సమీపంలోని అణాకులం గోకులం క్షేత్రంలో రాధాకృష్ణ బట్ సోదరుల ఆధ్వర్యంలో గోమాత పూజా కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య పాల్గొని, గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పవిత్ర కార్తిక మాసంలో గోమాత పూజలు నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా గోపూజలు నిర్వహిస్తూ, ఈ ప్రాంత ప్రజలందరూ సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లేలా ఆకాంక్షించడం అభినందనీయమని కొనియాడారు. నేటి రోజుల్లో గోశాలల నిర్వహణ ఎంతో కష్టతరమైనప్పటికీ, నిర్వాహకులు ఏమాత్రం వెనకడుగు వేయకుండా సేవాభావంతో ముందుకు సాగడం నిజంగా భగవంతుడు వారికి కల్పించిన గొప్ప అదృష్టమని ప్రశంసించారు. అనంతరం క్షేత్ర నిర్వాహకులు నాయకులను ఘనంగా శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాధాకృష్ణ బట్, రఘు ప్రసన్న బట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నర సింహ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోమాత కృపకు పాత్రులయ్యారు.

సింగిల్ విండో వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **బీజేపీ నేతలు**



మక్తల్, నవంబర్ 10 (జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించకుండా డైరెక్టర్లను నామినేట్ చేస్తూ సింగిల్ విండో చైర్మన్ పదవులను కైవసం చేసుకుంటోందని బీజేపీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరామిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట రాములు ముదిరాజ్ విమర్శించారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల సభ్యత్వంతో ఏర్పాటైనవని, వాటికి ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ విధానాన్ని అమలు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించారు. డైరెక్టర్లను నామినేట్ చేయడం ద్వారా సింగిల్ విండో చైర్మన్ పదవులను దక్కించుకోవడంతో పాటు రైతుల ఓటు హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఢిల్లీ, కేరళ తదితర ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో మాత్రం రైతుల ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని విమర్శించారు. రైతుల ఓట్లతో ఏర్పడాల్సిన సహకార సంఘాల పాలకవర్గాలను నామినేషన్ల ద్వారా నియమించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సహకార సంఘాలకు రైతుల ద్వారానే నేరుగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరించాలని సూచించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నామినేటెడ్ విధానాన్ని రద్దుచేసి సహకార సంఘాల సభ్యులతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఎన్నికలు నిర్వహించే వరకు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్ని స్వామి, మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, ఓబీసీ మోర్చా నాయకుడు ఆడెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేస్తే రూ.500 జరిమానా...

- **ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: గ్రామ సభ ప్రత్యేక అధికారి మల్లయ్య, కార్యదర్శి రవికుమార్**



ఖిల్లా ఘనపురం, నవంబర్ 10 (జనంసాక్షి): గ్రామంలో తాగునీటిని వృథా చేస్తే గ్రామపంచాయతీ తరఫున రూ.500 వరకు జరిమానా విధిస్తామని గ్రామ సభ ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తమై నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఇంటి కుళాయిల ద్వారా వచ్చే తాగునీటిని అవసరమైనంత మాత్రమే వినియోగించుకోవాలని, వృథా చేస్తే జరిమానా తప్పదని అధికారులు స్పష్టం చేశారు. రైతులు కూడా నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని నీటి ఆధారిత పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మల్లయ్య సూచించారు. పంటలు, విత్తనాల వివరాల కోసం వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ వి.బి.జి. రామ్.జి. ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో 200 మందికి పైగా కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు. జాబ్ కార్డులు లేని వారు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేస్తే కొత్త కార్డులు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో సుమారు కోటి రూపాయలతో ఉపాధి హామీ పనుల కార్యాచరణ ప్రారంభమైందని, రైతుల పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, కమ్యూనిటీ భూముల్లో కాల్వల పక్కన చెట్ల తొలగింపు తదితర పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంత నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్మాణానికి రూ.6,500 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంజుల, అగారం ప్రకాష్, మ్యాతరీ రాములు, గౌస్ పాషా, బుచ్చిబాబు గౌడ్, వడ్డే మధు, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అరుణజ్యోతిపై దాడికి నిరసనగా క్రైస్తవ సంఘాల ఐక్య ఆందోళన

- **లక్ష్మణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 10 (జనంసాక్షి): అరుణజ్యోతి అనే యువతిపై లక్ష్మణ్ అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను నిరసిస్తూ మంగళవారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో క్రైస్తవ సంఘాలు ఐక్యంగా నిరసన కార్యక్రమం నిర్వహించాయి. వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, మైనారిటీ నాయకులు పాల్గొని బాధితురాలికి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ ప్రతి పౌరుడి హక్కు అని, ఎవరి మత విశ్వాసాలను వారు ప్రశాంతంగా ఆచరించే స్వేచ్ఛను గౌరవించాలని పేర్కొన్నారు. విశ్వాసాలను వ్యక్తపరిచే సందర్భంలో దాడులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు.

అరుణజ్యోతిపై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మణ్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సమాజంలో మత సామరస్యం, పరస్పర గౌరవం



కొనసాగాలని, ప్రతి ఒక్కరూ తమ మత విశ్వాసాలను స్వేచ్ఛగా ఆచరించే వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హక్కుల పరిరక్షణ కోసం క్రైస్తవ సమాజం ఐక్యంగా, శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ ప్యాట్రన్ రెవ. డాక్టర్ ఎస్. వరప్రసాద్, వైస్ చైర్మన్ బి.ఐ. జాకబ్, సెక్రటరీ జె.ఐ. డేవిడ్, కోశాధికారి టి.ఎ. స్టీఫెన్, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు దాసరి శామ్యూల్ ప్రభాకర్, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షులు కాశపోగు ప్రసాద్, చర్చి కౌన్సిల్ సభ్యులు, పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరువుతో రైతులు కన్నీరు మున్నీరు.. ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర తగదు: సిపిఐ

- **జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి**

వనపర్తి బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి): జిల్లాలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయ రాములు విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో విజయ రాములు మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ వరితో పాటు రబీలో సాగు చేసిన వేరుశనగ, మినుము పంటలు నీరు, విద్యుత్ కొరతతో ఎండిపోయాయని తెలిపారు. వరి సాగుకు ఎకరాకు రూ.35 వేలు, పత్తి తదితర వాణిజ్య పంటలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. వరి పంట పాలు పోసే దశలోనే ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, తాగునీరు, పశుగ్రాసం కొరత కూడా తీవ్రమైందన్నారు.

జిల్లాలో ఇప్పటికే 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా, రేవల్లి, చిన్నంబాయి, శ్రీరంగాపూర్, మదనాపూర్ మండలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా



ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించాలన్నారు. ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు, ఆరుతడి పంటలకు రూ.20 వేలు నష్టపరిహారం అందించాలని కోరారు. పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తి కార్మికులకు ఉపాధి పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కరువును జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి బాధితులను ఆదుకోవాలని హెచ్చరించారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజలను సమీకరించి సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కళావతమ్మ, రమేష్, మోష, రాబర్ట్, భాస్కర్, గోపాలకృష్ణ, రవీందర్, పృథ్వినాదం, కుతుబ్, సంతోష్, కాకం బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తమ కుమారుడి

పెండ్లి పత్రికలు ఆలయాల్లో పెట్టి.. పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి దంపతులు

- **రుద్రారంలోని గణేష్ గడ్డ వినాయక ఆలయంలో తొలి పత్రిక పెట్టి పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి, నిర్మల**
- **ఆలయాల్లో పూజలు చేసి.. బ్రాహ్మణుల ఆశీర్వచనాలు తీసుకున్న తూర్పు భరత్ సాయి రెడ్డి**
- **16 ఆలయాల్లో పత్రికలు పెట్టి.. పూజలు చేసిన జగ్గారెడ్డి కుటుంబసభ్యులు**



సంగారెడ్డి నవంబర్ 10 (జనంసాక్షి):
తమ కుమారుడు తూర్పు భరత్ సాయి రెడ్డి వివాహం ఈ నెల 25న జరగనున్న నేపథ్యంలో మంగళవారం జగ్గారెడ్డి, నిర్మల దంపతులు తమ కుమారుడిని వెంట బెట్టుకొని ఆలయాలకు వెళ్లారు. పెళ్లి పత్రిక దేవుళ్ళు, అమ్మవార్ల సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు.

తొలి పత్రికను రుద్రారంలోని గణేష్ గడ్డ ఆలయంలో పెట్టి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సంగారెడ్డిలోని అస్తబల్ రేణుక ఎల్లమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, సంగమేశ్వర ఆలయం, భవానీ మందిరం, మాణిక్ ప్రభు మందిర్, లక్ష్మి నరసింహ స్వామి ఆలయం, దుర్గమ్మ గుడి, ముత్యాలమ్మ గుడి, వడ్డె వీర హనుమాన్ మందిర్, శ్రీ వైకుంఠ పురం ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం,





నవరత్నాలయం, ఎర్ర పోచమ్మ గుడి, రామ్ నగర్, రామ్ మందిర్... ఇలా మొత్తం 16ఆలయాల్లో పత్రికలు పెట్టి.. పూజలు నిర్వహించారు.

తాతా - నానమ్మ ఫోటో వద్ద పత్రిక పెట్టి.. తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి...

ఆలయాల్లో పత్రికలు పెట్టి పూజలు చేసిన అనంతరం జగ్గారెడ్డి దంపతులు రామ్ నగర్ లోని తమ ఇంటికి చేరుకున్నారు. ఆ తర్వాత ఇంట్లోని పూజా మందిరంలో దేవతా విగ్రహాలకు నమస్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి తూర్పు భరత్ సాయి రెడ్డి వాళ్ల ఆశీస్సులు అందుకున్నారు

భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, అయ్యప్ప స్వామి

ఆలయాల్లో ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ప్రత్యేక పూజలు



గుమ్మడిదల, నవంబర్ 10 (జనంసాక్షి): గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాల్లో కొలువుదీరిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయాలను ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ యువజన రాష్ట్ర అధ్యక్షుడు శంబిపూర్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం స్వామివార్లను దర్శించుకున్న శంబిపూర్ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేదమంత్రోచ్చారణల మధ్య అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జిన్నారం వెంకటేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు కుమార్ గౌడ్, జనార్ధన్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయికోటి రాజేష్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ తహసిల్దార్

కార్యాలయ అటెండర్ అనారోగ్యంతో మృతి






మల్దకల్, నవంబర్ 10 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్ మద్దమ్మ (50)సోమవారం రాత్రి కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనారోగ్యంతో మృతి చెందినట్లు కార్యాల సిబ్బంది తెలిపారు.ఆమె స్వగ్రామం ఐజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయి.

మృతురాలకు కొడుకు, కూతురు ఉన్నారు. మద్దమ్మమృతి పట్ల తహసిల్దార్ ఝాన్సీరాణి, సీనియర్ అసిస్టెంట్ కరీం,గిర్దవర్ మహేందర్,జిపిఓలు, కార్యాల సిబ్బంది సంతాపం తెలిపారు.మృతురాలు మద్దమ్మ భౌతికకాయంపై తహసిల్దార్ ఝాన్సీరాణి సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా అంత్యక్రియలు నిమిత్తము 30వేల రూపాయలను కుటుంబసభ్యులకు అందజేశారు.

ప్రతి పాఠశాలలో ప్రశస్త స్క్రీనింగ్ ప్రక్రియ



కొండపాక,నవంబర్, 10: (జనంసాక్షి):
కుకునూరు పల్లి మండల పరిధిలో దివ్యాంగ పిల్లలను ముందస్తుగా గుర్తించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా3 నుండి 18 ఏళ్ల వయసు గల దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు ప్రశస్తు స్క్రీనింగ్ ప్రక్రియను ప్రతి పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ప్రత్యేక ఉపాధ్యాయులు మాట్లాడుతూ పి.ప్రశాంత్, పి అంజయ్య తో కలిసి మండల పరిధిలోని జడ్పిహెచ్ఎస్.

ఎంపీపీ ఎస్ చిన్న కిస్టాపూర్ పాఠశాలలోని స్క్రీనింగ్ నిర్వహిస్తూ యు డైస్ రికార్డుల ప్రకారం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు అందరూ వారి వారి మొబైల్ల ద్వారా సంక్షిప్త సమాచారాన్ని పాఠశాలలోనే ప్రశస్తు పోర్టల్ లో ఆన్ బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేసిన సమగ్రమైన సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నామని స్పెషల్ టీచర్స్ ప్రశాంత్, అంజయ్యతో కలిసి మండల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల సందర్శించి స్క్రీనింగ్ చేయడం జరిగిందని ప్రశాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొన్ని గ్రామాలకే పరిమితమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలు...

- పీఏసీఎస్ పరిధిలో మూడు..
- ఐకేపీ ఆధ్వర్యంలో మరో మూడు కేంద్రాలు ప్రారంభం....
- ఆరు గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటేది?
- ధాన్యం కుప్పలతో రైతుల ఆందోళన....

చిలప్‌చెడ్, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొన్ని గ్రామాలకే పరిమితం కావడంతో మిగతా గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీఏసీఎస్ పరిధిలో మూడు, ఐకేపీ ఆధ్వర్యంలో మరో మూడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, మిగిలిన గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా పంటను ఎక్కడ నిల్వ చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

మండలంలోని చిలప్‌చెడ్, చిట్కుల్, సోమక్కపేట్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, రాందాస్‌పల్లి, శిలాంపల్లి, చండూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. అయితే గౌతాపూర్, ఫైజాబాద్, బండపోతుగల్, అజ్జమర్రి, గంగారం, గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం.. రైతులకు ఇక్కట్లు

తమ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారని పీఏసీఎస్, ఐకేపీ అధికారులను రైతులు ప్రశ్నిస్తున్నా సరైన స్పందన రావడం లేదని ఆరోపిస్తున్నారు. ఒకరిపై మరొకరు బాధ్యతను నెట్టుకుంటూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యాన్ని కుప్పలుగా నిల్వ





ఉంచాల్సి వస్తోందని చెబుతున్నారు.

వర్షాలకు ధాన్యం తడిస్తే తీవ్ర నష్టం...

వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ధాన్యం కుప్పలతో ఇబ్బందులు పడుతున్న తమకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడం మరింత భారంగా మారిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మిగిలిన గ్రామాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మోతె శోభన్‌రెడ్డి

- జన్మదిన, దీపావళి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కారం



కొడంగల్ (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు, ప్రముఖ నాయకుడు మోతె శోభన్‌రెడ్డి కొడంగల్‌లో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి జన్మదినం, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో రాష్ట్ర ప్రజలకు మరింతకాలం సేవలందించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మోతె శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు తెలంగాణ ప్రగతికి దోహదపడుతున్నాయని అన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువతతో పాటు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల ఆకాంక్షలను గుర్తించి వారికి తగిన గౌరవం, గుర్తింపు, న్యాయం కల్పించే దిశగా ప్రభుత్వం మరింత చొరవ చూపాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, సముచిత గుర్తింపు అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఉద్యమకారుల న్యాయమైన ఆకాంక్షల సాధనకు ప్రభుత్వం చేపట్టే చర్యలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ ఫుట్‌బాల్ బరిలో

గోపాలపేట విద్యార్థి.. తెలంగాణ జట్టుకు లింగం ఎంపిక!

- ఎస్‌జీఎఫ్ అండర్-14 జాతీయస్థాయి పోటీలకు గోపాలపేట విద్యార్థి ప్రతిభ..
- మధ్యప్రదేశ్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం



గోపాలపేట, నవంబర్ 10 (జనంసాక్షి): క్రీడా రంగంలో గ్రామీణ విద్యార్థి మరో ఘనత సాధించాడు. వనపర్తి జిల్లా గోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి లింగం జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర ఫుట్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

తన క్రీడా నైపుణ్యంతో రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటుకుని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మేడ్చల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో లింగం ప్రతిభావంతమైన ఆటతీరును కనబరిచాడు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. నవంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

విద్యార్థి లింగం జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలిపారు.



అలాగే సీనియర్ క్రీడాకారుడు రవి, ఫుట్‌బాల్ కోచ్ సందీప్ విద్యార్థి క్రీడా ప్రతిభను అభినందించారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థి జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల గోపాలపేటలో ఆనందం వ్యక్తమవుతోంది. లింగం జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను చాటుకుని విజయం సాధించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

ప్రజా వ్యతిరేక పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం

- మూడేళ్లలో తెలంగాణకు ఏం చేశారో చెప్పాలి
- హామీల అమలుపై దృష్టి పెట్టాలి.. రేవంత్ వైఖరి మార్చుకోవాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్



హైదరాబాద్ (జనంసాక్షి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన పూర్తిగా గాడి తప్పిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీల అమలులో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

గత బీఆర్ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు పెద్దగా తేడా లేదని, రెండు ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలనే అనుసరిస్తున్నాయని దుయ్యబట్టారు. మాటలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని హితవు పలికారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ వెనుకబడుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తన వైఖరి మార్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వీరేందర్‌గౌడ్ హెచ్చరించారు.

ఈ నెల 12న సంగారెడ్డిలో ఉద్యోగాల జాతర

- పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉద్యోగాలు
- 225 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు
- జిల్లా ఉపాధి అధికారి రవికిరణ్ రెడ్డి



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 12న గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రవికిరణ్ రెడ్డి తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

ఈ జాబ్‌మేళాలో సాయి ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ సంస్థలో 200, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలో 25 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాయి ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్‌లోని ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, సాంకేతిక డిగ్రీ అర్హత కలిగి, 18 నుంచి 35 ఏళ్ల వయస్సున్న పురుషులు, మహిళలు అర్హులని వెల్లడించారు. ఎంపికైన వారికి నెలకు రూ.17,288 వేతనంతో పాటు భోజనం, వసతి, ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు.

శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలోని 25 ఉద్యోగాలకు డిగ్రీ అర్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సున్న పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరేవారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందని వివరించారు.

అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో లేదా 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.